# రెండు చూపులు



— పొదిల శ్రీరామమూర్తి

విద్యాధరరావుకు వేగంగా నడుపుతున్న కారును ఆపక తప్పలేదు. కారులో కూర్చున్న వాళ్ళంతా రైలు గేటు పడ్డందుకు ఒక్క నిట్టూర్పు విడిచారు. అక్కడ ఓవర్ బ్రిడ్జి కోసం కట్టి నిలబడి సిమెంటు స్తంభాలు త్వరలో మీలాంటి వాళ్ళ బాధలు తీరుస్తామంటున్నట్లు అభయం ఇస్తున్నాయి.

"సరదాగా వెళ్దామంటే ఈ గేటు ఒకటి. ఈ గేటు భేతాళుని బారినిపడకుండా నాకు తెలిసినంతవరకూ మన కారు ఎప్పుడూ ముందుకు వెళ్ళలేదు" అంది వాళ్ళ రెండో అమ్మాయి.

ఆ రోజు ఆదివారం. ఆ సాయంకాలం అందంగా, ఆనందంగా గడపడానికి బయలుదేరారు విద్యాధరరావు భార్యా, బిడ్డలతో కార్లో. ఆ రోజు సాయంకాలం టి.వి.లో హిందీ సినిమా చూడకపోయినా ఫర్వాలేదని అంతకు ముందు రోజు వాళ్ళ మూడో అమ్మాయి తీర్మానించడంతోనూ, వారం రోజుల నుంచి వంటావిడ రాని కారణంగా విద్యాధరరావు భార్యామణి చేస్తున్న వంటతో అంతా విసిగిపోవడంతోనూ హోటలుకు బయలుదేరారు. ఇలా హోటల్లో భోజనాలు వాళ్ళకు చాలా మామూలే.

రైలు గేటు వేసి వుండడంతో గేటుకు అటూ ఇటూ ఆగి వున్న వాహనాలు హనుమంతుని తోక లాగా పెరిగిపోతున్నాయి. సంకేతం ఇస్తే చాలు నేనంటే నేనంటూ ముందుకు దూకడానికి రెండు వైపులా సిద్ధంగా వున్న యుద్ధ సైనికుల్లా పొంచి వున్నట్లున్నాయి వాహనాలు.

రైలు గేటు వేసి వుండడం కార్లలో కూర్చున్న వాళ్ళందరి సహనానికీ పరీక్ష లాంటిదనే చెప్పచ్చు. ఓర్పు వహించడం ఈ కాలంలో చాలామంది మరచిపోతున్న ఒక సద్గుణం. ఏది ఏమైనా గేటు తీసేదాకా ఆగిపోయిన కార్ల, బస్సుల జనానికి ఉస్సు ఉస్సు మంటూ గడపక తప్పదు.

ఈ గేటు ఎంత త్వరగా తీస్తే అంత మంచిదని అనుకొనే వాళ్ళున్నట్లే ఈ గేటు ఇంకొంచెం సేపు మూసి వుంటే బాగుంటుందనుకొనే వారూ కొందరున్నారు. వాళ్ళలో పేపర్లు అమ్ముకొనే కుర్రవాడు, వేరుశనగకాయలు అమ్మే కుర్రది, నలుగురినీ బిచ్చ మెత్తుకొని జీవించే తాత ముఖ్యులు. పేపర్లు అమ్మే కుర్రాడు నాటి సాయంకాలం సంచికలోని ముఖ్యవార్తల్ని ఏకరువు పెడ్తూ వ్యాపారాన్ని విజృంభింప చేసే ప్రయత్నంలో వున్నాడు. వేరుశనగ కాయలు అమ్మే అమ్మాయి బుట్టను పట్టుకొని అరుస్తూ తిరుగుతోంది. ముసలి బ్రతుకు నడిపించడం కోసం పది పైసలు బిచ్చమేయండని బ్రతిమాల్తూ కార్లలోని వాళ్ళ తిట్లను, మైసూరుపాకు తినాలని ఆపేక్షిస్తున్నప్పుడు మిరపకాయ కొరకాల్సిన పరిస్థితి ఏర్పడిన అనుభూతి పొందుతూ యాచన కొనసాగిస్తూ విద్యాధరరావు కారు దగ్గర కొచ్చాడు "బాబూ! ముసలి వాడికి బిచ్చమేయండంటూ."

"కారు ఆగితే చాలు ఈగల్లా ముసురుతారు బిచ్చ గాళ్ళు. దేశం నాశనమయిపోతోంది" విద్యాధరరావు బిచ్చగాడిని తిట్టి తరిమేశాడు. బిచ్చగాడికి ఇవి మామూలే అవడంతో వేరే కారు దగ్గర కెళ్ళాడు. దేశంలోని బిచ్చగాళ్ళందరి మీదా విరుచుకుపడ్డాడు విద్యాధరరావు.

"మన దేశంలో సోమరిపోతులంతా బిచ్చగాళ్ళుగా తయారవుతారు. మన దేశంలో ఉన్నంత సోమరితనం మరెక్కడా లేదు. అందుకే మన దేశం ఇలా తగలబడింది ... ఛీ ... ఛీ..."

విద్యాధరరావు పిల్లలు ఇవేవీ వినిపించుకోనట్లే వున్నారు. రైలు శబ్దాల కోసం రిక్కించి వున్న చెవుల్లోకి ఈ మాటలు ఏవీ దూరినట్లు లేవు. వాళ్ళు ఈ విషయంలో ఏ విధంగానూ పాల్గొనకపోవడమే దీనికి విదర్శనం.

అంతలో రైలు గేటు దాటడం, గేటు తెరవటం జరిగాయి. అటూ ఇటూ ఏర్పడిన కదలికల్తో, కారు హారన్ల మోతలతో ఆ ప్రాంతం నిండిపోయింది చాలా సేపు.

వేటగాడు వదిలిన బాణంలా విద్యాధరరావు కారు హోటల్ కృష్ణ ఓబ్రాయి ముందు ఆగింది. అంతా దిగి అంచెలంచెలుగా నమస్కారాలు అందుకొంటూ లోపలకు వెళ్ళారు.

ఖాళీగా వున్న ఒక టేబుల్‌ను ఎంచుకొని కుర్చీల్లో కూర్చుని అంతా మెనూ కార్డులోకి తొంగి చూడడం మొదలుపెట్టారు. ఎవరికి కావలసినవి వాళ్ళు ఎంచుకుని మెరిసిపోతున్న వెయిటర్‌కు పదార్థాల జాబితా ఇచ్చారు. ఆ మెనూ కార్డులో రూపాయి విలువగల వస్తువులు ఏభయిలూ, వందలల్లో వున్నాయి. అయినా వాళ్ళంతా లెక్క చేయకుండా వెనకా ముందూ లేకుండా కావలసినవన్నీ తెప్పించుకొని తిన్నారు. కులాసా కబుర్లతో పదార్థాలను వంచుకొంటూ భోజన కార్యక్రమాల్ని ముగించారు. అందరి ముఖాల్లో ఉత్సాహం వుట్టిపడ్తోంది. బేరర్ బిల్లు తెచ్చి యిచ్చాడు. ఏడు వందల డెబ్బయి రూపాయిల బిల్లు అయింది.

విద్యాధరరావు జేబులోంచి పర్సు తీశాడు. అది వంద రూపాయిల నోట్లతో నిండి వుంది. దాన్లోంచి ఎనిమిది నోట్లు తీసి వెయిటర్ తెచ్చి యిచ్చిన బిల్లుకు జోడించి "ప్లాస్టిక్ పౌచ్"లో వుంచాడు. బేరర్ నవ్వుతూ కౌంటర్ దగ్గరకు అది తీసుకొనివెళ్ళాడు. మిగిలిన ముప్ఫయి రూపాయిలు 'టిప్'గా వదిలేసి విద్యాధరరావు సంసార సభ్యులు టిప్‌టాప్‌గా బయటకు వెళ్ళి కారెక్కారు త్రోవలో ఎందరో వెయిటర్లు చెప్తున్న గుడ్ నైట్‌లను స్వీకరిస్తూ.

కారు బయలుదేరాక కాసేపటికి "ఇప్పుడు మనం అతి విచిత్రంగా ప్రవర్తించాం. ఏమిటది. చెప్పండి?" అనే ప్రశ్నను వదిలింది వాళ్ళ మూడో అమ్మాయి.

"అంతా కాసేపు ఆలోచన చేసి 'తెలీదు' అన్నారు. అంతేకాక దానికి సమాధానం చెప్పే 'మూడ్'లో ఎవరూ లేరు.

"కారు ఆపండి డాడీ..." హుకుం జారీ చేసింది వాళ్ళ మూడో అమ్మాయి. కారు సడన్‌గా ఆగింది.

"నే చెప్తా వినండి."

ఇందాక రైలు గేటు దగ్గర బిచ్చగాడికి పావలా కాదు కనీసం పది పైసలు వేయడానికి నిరాకరించిన మనం హాయిగా ఉద్యోగం చేసుకొంటూ నిశ్చింతగా కాలం వెళ్ళబోసుకోగలిగిన వెయిటర్‌కు ముప్ఫయి రూపాయిల టిప్ ఇచ్చి వచ్చేశాం. రెండూ రెండూ నాలుగు అనే సూత్రం ఎక్కడయినా ఎప్పుడయినా ఒకటే. అయితే మనకు రైలు గేటు దగ్గరి సోమరిపోతు సూత్రం కృష్ణ ఓబ్రాయిలో పనికిరాలేదు. ఇంతకంటే విచిత్రం వుందా?"

"దీని కివ్వాళ మూడ్ బాగున్నట్లు లేదు. కారు పోనీయండి" అంది వాళ్ళ పెద్దమ్మాయి.

"అవును నీ మూడ్ బాగా లేదు. రెస్టు తీసుకో" అన్నారు అంతా. కారు బయలుదేరింది.